


# కాలువ

- బెజ్జారపు వినోద్ కుమార్

(పల్లకి సచిత్ర వారపత్రిక నవంబర్ 26, 1987 సంచికలో ప్రచురించబడింది)

**సాయంత్రమయింది.**

సాయంత్రమయ్యిందంటే చాలు నా ఎడద అచ్చు నేలతల్లిలాగే పులకరిస్తుంది. పొద్దున్నుంచీ వేగిపోయి శీతల పవనాలతో కొత్త ఊపిరి పోసుకుంటున్నట్టు.

అప్రయత్నంగానే నా కాళ్ళు ఊరవతలి దారిపట్టాయి.

'గుడీవినింగ్ ఫ్రెండ్' గమ్మత్తయిన పలకరింపు

తలతిప్పి చూశాను.

ఉమ్మెత్త మొక్కలు అటూ ఇటూ ఊగుతూ విష్ చేస్తున్నాయి. వాటిని దాటిన శీతల సమీరమొకటి అలవోకగా నన్ను కావలించుకుంది. ఆ కౌగిలింతతో ఏర్పడిన గగుర్పాటుకి నా కాళ్ళు తడబడ్డాయి.

ఆ సమీరం నన్ను దాటుకుని అలా అలా వెళ్ళి కోయిలకు నా రాకను తెలిపిందేమో దూరం నుండే కూయని కుహూజితం చేసింది కోయిల.

"నేస్తం! క్షేమమా!" అని అడిగినట్టు.

"కూ" నేనూ సమాధానమిచ్చాను క్షేమమే అన్నట్టుగా

"కూ" ఈసారి రెట్టింపు తీయదనంతో పలికింది కోయిల.

పొలాల గట్లు జాగ్రత్తగా దాటాను. దాటుతున్నంతసేపు పచ్చని వరి పైరు సంతోషంగా తలూపసాగింది.

దూరంగా ఏదో పాట లయగా నా హృదయతంత్రులను కుదిపింది. ఆ పాట వినిపిస్తున్న దిక్కుగా కాస్తంత దూరం వెళ్ళగానే ఎదురయ్యారు పల్లె పడుచులు నెత్తిన గడ్డిమోపులతో పరవశంతో కదిలి వస్తున్న హంసల బారులా...

కుడిచేతిని పైకెత్తి గడ్డిమోపును పట్టుకోవడంతో బిరుసెక్కిన రొమ్ములు ఇంకా పైకి పొడుచుకు వచ్చాయి. ఎప్పుడెప్పుడు జతగాని చేతిలో పిండిలా మారిపోదామా అన్నట్లుగా .... ఇంకా తడియూరని బాహుమూలలు చల్లగాలికి సేదదీరడానికా అన్నట్లు విచ్చుకుని ఉన్నాయి.

ఆత్మీయతా సౌరభాలు నిండిన చిరునవ్వులతో పలకరిస్తూ వెళ్ళిపోయారు. వాళ్ళ హృదయాల నిండుగా నిష్కల్మం. వారి పలకరింపు నిండుగా స్వచ్ఛత.

ఊరు దాటి వచ్చాను.

ఊరవతల నిండుగా ప్రవహిస్తున్న కాలువ ఆప్యాయంగా పలకరించింది. అస్తమిస్తున్న ఆదిత్యుని తాకిడితో అరుణిమ దాల్చిన కాలువ నా రాకతో తన ప్రవాహ వేగాన్ని ఇంకా పెంచింది.

బ్రిడ్జిపై నిలబడి నీళ్ళలోకి తొంగి చూశాను.

ప్రతిరోజూ గంటల తరబడి అలా చూస్తూనే గడుపుతాను. చప్పుడు చేయకుండా ప్రవహించే కాలువ మౌనం నా హృదయం నిండుగా నిండిపోయి ఎన్నో ఊసులు చెబుతుంది. అలాగే ఉండిపోతాను ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ....

దూరంగా నీళ్ళలో ఏదో వస్తున్నట్టుగా కనిపించింది.

కళ్ళు చిట్లించుకుని చూశాను.

బంతి పూల బారు.

"ఓహో! ఇవ్వాళ బంతిపూలు తురుముకున్నట్లున్నావ్" అడిగాను కాలువని.

మౌనం వహించింది కాలువ.

మళ్ళీ దూరంగా ఏదో తేలుతూ కనిపించింది దగ్గరికొచ్చి చూశాను. ముందు చేమంతుల గుత్తి కనిపించింది.

ఇంకాస్త దగ్గరకు వచ్చాక చూసి అదిరిపడ్డాను.

చేమంతుల చెండుతోపాటే దాన్ని తురుముకున్న తల.

చంద్రబింబంలాంటి మొహం పసుపు పచ్చని వర్ణంలో ఇంకా ఏదో వింతకాంతిని వెదజల్లుతూనే ఉంది.

ఒక్క జడ.. మెడలో తళతళలాడుతున్న పుస్తెలతాడు... పట్టు అంచుతో వింత శోభను తెస్తున్న జాకెట్.. పసివాడక ముందే తుంచి వేయబడ్డ ముద్ద బంతిలా అగుపించింది.

ఒడ్డుకు లాగి ఆ చిన్నారి చెల్లిని నా ఒడిలో పడుకోపెట్టుకుని "ఏంటమ్మా! నీకేం కష్టం?" అని అడిగి ఆమె కష్టాల్ని తీర్చి గుండెల్లో దాచుకోవాలనిపించింది.

నా ఆలోచనల ప్రమేయం లేకుండానే కొట్టుకుపోయిందా నిర్జీవ శరీరం.

కనిపించినంత వరకూ ఆమెనే చూస్తుండిపోయాను.

కాలువ ప్రవాహంతో పోటీపడుతూ నా కంటి నుండి కారిన అశ్రుధారలు కాలువలో పడిపోయాయి. ఆ అశ్రువులు ఎప్పటికయినా ఆ శరీరాన్ని తాకి ఓదార్చకపోతాయా అనుకుంటూ నీరసంగా ఇంటివైపు అడుగు వేశాను.

మూడు రోజుల వరకూ కోలుకోలేకపోయాను. ఆ మూడు రోజులూ కాలువవైపు వెళ్ళడానికి మనస్కరించలేదు.

కాని వెళ్ళకుంటే గుండెలోతుల్లో ఏదో కోల్పోయిన బాధ.

మూడో రోజు సాయంత్రం యాంత్రికంగానే నా కాళ్ళు ఊరవతలి బాట పట్టాయి. మూడు రోజులుగా నా పలకరింపు లేక వాడిపోతూ ఉన్న ప్రతి మొక్కా నా అడుగుల సవ్వడికే నిటారుగా నిలబడి చేతులూపసాగింది.

అలా నడుచుకుంటూ పోయాను.

అప్రయత్నంగానే కాలువ చేరుకున్నాను. బ్రిడ్జిపైన నిలబడి రెయిలింగ్స్ పైన చేతులానించి కాలువలోకి చూడసాగాను.

అన్ని రోజులుగా నా రాక కానరాక నిశ్శబ్దంగ రోదిస్తున్నట్టుగా ఉండిపోయింది.

"ఏయ్! ఎలా ఉన్నావ్" పలకరించాను.

గలగలా నవ్వింది. నూతనోత్తేజంతో మెలికలు తిరుగుతూ పరిగెత్తింది.

చల్లని ఆ సాయంత్రం ఇంటి ముఖం పట్టిన గోవుల మంద హుషారుగా పరుగెత్తింది. వాటి పద ఘట్టనతో పరవశించిన భూదేవి ఇంతెత్తున ధూళిని రేపింది. ఆ ధూళిలో నిండుగా మునిగిపోయాను. ఆ ధూళి తాకిడితో నా శరీరంలోని అణువణువూ ఏదో వింత జలదరింతను చవిచూసాయి.

కాలువలోకి చూశాను.

గోధూళి పొదల మాటున దూరంగా మసక మసగ్గా ఏదో తేలుతూ కనిపించింది.

ఎందుకో గాని నా గుండె దడ దడలాడింది.

అయినా ధైర్యం తెచ్చుకుని చూసి కట్టెలా బిగుసుకుపోయాను.

నీటితోపాటుగా.. ఇంకో శవం.

ఆ నిర్జీవ శరీరంలో ఎంత నిర్మలత్వం?

ముడిచిన సిగ ఇంకా విడివడలేదు. నుదిటిపైన గుండ్రని తిలకం ఇంకా చెరిగిపోలేదు.

ప్రియునిపై అలకతో పడకెక్కి అలవోకగా కన్నుమూసిన ముగ్ధలా ఉంది.

ఏం చేయాలో పాలుపోలేదు. చేతులు మాత్రం రెయిలింగ్స్‌ని గట్టిగా పట్టుకున్నాయి.

"పిచ్చి తమ్ముడూ! ఎందుకురా ఆ ఏడుపు?" అంటూ ఆ శరీరం వేదాంత ధోరణిలో మాట్లాడుతున్నట్టుగా అనిపించింది.

చెక్కిలి తడుముకున్నాను. కన్నీటి ప్రవాహం వెచ్చగా తగిలింది చేతికి.

ఒక్క పెట్టున ఆవేశం ముంచుకొచ్చింది.

శరీరమంతా వణుకుతుండగా కోపంగ కాలువతో అన్నాను.

"ఇంత మందిని పొట్టన పెట్టుకుని ఏం బావుకున్నావ్? భయంతో వాళ్ళు కాళ్ళూ చేతులూ గిల గిలా కొట్టుకుంటే కేరింతలు కొట్టావ్ కదూ!?... ఊపిరాడక వాళ్ళు గిలగిలా తన్నుకుంటుంటే, గలగలా నవ్వుకున్నావ్ కదూ!? అతి దారుణమైన శాడిస్టువి నువ్వు. కాగడా పెట్టి వెతికినా వాళ్ళ మొహాల్లో కపటం కనిపించడం లేదే. నీకేం అపకారం చేశారని వారిని పొట్టన పెట్టుకున్నావ్? ఇంత సెన్సిటివ్‌ని నీలాంటి శాడిస్టుతో ఇన్ని రోజులుగా ఎలా కలిసి ఉన్నానో... ఐ హేట్ యూ.. రియల్లీ ఐ హేట్ యూ" గట్టిగా గొంతు నాళాలు పగిలి పోయేలా అరిచాను ఏడుస్తూ

ఇంకా ఏదో కసి.

"బ్రతికుండగా నీ మొహం చూడను" అనేసి వెనక్కి తిరిగాను.

చిన్నగా నవ్వు వినిపించింది.

కాలువ నవ్వుతోంది.

"ఎందుకు నవ్వుతున్నావ్?" మండిపడుతూ అడిగాను.

"పిచ్చివాడా! ఒక్కసారి నాలోకి ప్రవేశిస్తావా? వింత వింత సత్యాలు చూపెడతాను" అంది.

"నో ఐ హేట్ యూ" గా.....ట్టిగా అరిచాను.

"అందుకే దోస్త్! ఒక్కసారి నాలోకి ప్రవేశించు. నువ్వూహించని విషయాలు చెబుతాను" మళ్ళీ అంది. ఆ పిలుపులో హృదయపూర్వక స్వాగతం.

మెట్ల పైనుండి కాలువలోనికి ప్రవేశించాను.

"అంత తొందరెందుకు.. పద" అంటూ కాస్త దూరం లాక్కెళ్ళింది. ఒక చోట ఆపింది.

"ఇటు వేపు చూడు" అది ఒక వైపు చూపెడుతూ.

అక్కడ నిశ్చలంగా పడివుందో అమ్మాయి పరికిణీలో.. అప్పుడే విచ్చుకోవడానికి సిద్ధమౌతున్న నందివర్ధనం మొగ్గలా.

"ఈ అమ్మాయిని చూస్తే నీకేమనిపిస్తుంది?" అడిగింది కాలువ.

"జడగంటలు అల్లాడిస్తూ నది ఒడ్డున గవ్వలు ఏరుకుంటున్న చిన్నారి చెల్లి గుర్తుకొస్తూంది" అన్నాను.

"కాని వారికలా అనిపించలేదే"

"ఎవరికి?"

"ఆ ఐదుగురికీ"

"ఏం చేశారు?"

"అతిదారుణంగా మానభంగం చేశారు"

"మైగాడ్"

"అప్పుడే ఏమయింది ఇంకా ముందుంది..."

"ఏమిటి"

"ఈ సంఘటనలో ఈ అమ్మాయి ప్రమేయం ఎంతుంది అంటావు?"

"ఏమీ లేదే"

"ఈ అమ్మాయిని రాళ్ళతో కొట్టి హింసించింది... ఊరవతలి వరకు కుక్కలా తరిమింది.... బాధ్యతలు తెలీకుండా తిరిగిన అమాయక వయసులోనే కులటను చేసి ప్రతిక్షణమూ నరకాన్ని రుచి చూపించింది"

".............."

"దారుణమైన విషయం ఏమిటంటే ఆమె పై రాళ్ళు విసిరిన వాళ్ళలో ఆ ఐదుగురూ ఉండడం... ఆ బాధలకు తట్టుకోలేక దయనీయంగా విలపిస్తూ తన గోడునంతా నాకు చెప్పుకుంది... ఆమె కష్టాలన్నీ కడతేరేలా నాలో చేర్చుకున్నాను. హాయిగా సేదదీర్చాను."

"................"

"అంతగా కన్నీరు కార్చకు" ఉన్నట్టుండి చెప్పింది కాలువ.

"నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాను.

"అమాయక నేస్తం! కన్నీటిలో ఉండే ఆవేదనా సెగలకు నాలోని నీటినంతా కూడా ఇగిరింపజేసే శక్తి ఉందని నీకు తెలీదు పాపం... ఇంకాస్త ముందుకు వెళదామా?" అంది కాలువ.

అడిగిందే గాని నా ప్రమేయం లేకుండానే నన్ను లాక్కెళ్ళింది.

"ఇదిగో ఇక్కడ చూడు" అంది ఒక చోట ఆపి.

పక్కకి తిరిగి చూశాను.

ఇంకో యువతి శవం.

పరీక్షగా చూశాను.

"ఈ అమ్మాయి నీ ఒడిలో చేరి ఎన్ని రోజులయ్యిందేం?" ప్రశ్నించాను.

"గంటన్నరయింది"

"ఇంతలోనే చేపలు ఎంతగా కొరికాయో!" అన్నాను.

"కొరికింది చేపలు కాదు"

"మరి"

"ఆమె భర్త"

"వ్వాట్?" అదిరిపడ్డాను.

"నిజం... ఇప్పుడు చూడు" అంది చీరను జరిపి.

"బాప్‌రే శరీరం నిండుగా రంధ్రాలు..."

"ప్రతిరోజూ కాలుతున్న సిగరెట్‌తో, రేజర్ బ్లేడుతో, పళ్ళతో, ఫోర్క్‌తో ఆమె భర్త చేసిన రంధ్రాలివి"

ఆ సమయంలో ఆమె ఎంత బాధ అనుభవించిందో ఊహించుకున్నాను. గుండె వణికింది. అంత ప్రవాహమూ నా చెమట తాకిడికి వేడెక్కింది.

అరవిరిసిన చేమంతిలా నిర్మలంగా నిద్రిస్తున్న ఆమె మొహాన్ని రెండు చేతుల్తోను పట్టుకున్నాను. అప్రయత్నంగా నా కుడి చెయ్యి ఆమె కళ్ళను తుడిచింది.

"అంత దారుణ బాధ నుండి ఆమెను విముక్తి చేయడం తప్పే అంటావా!?" అడిగింది.

"మౌనంగా ముందుకు సాగాను."

"ఇక్కడ చూస్తున్నావా?" ప్రశ్నించింది కాలువ.

చూశాను.

ఇంకో అమ్మాయి శవం.

కాలువ చెప్పబోయే దారుణమైన కథ వినడానికి నా చెవులు ఇంకా జీవించే ఉన్నాయి.

"గుండెలనిండా కోరికలు జుమ్మని ఝుంకారం చేస్తూంటే కొత్త కాపురంలోకిఅడుగుపెట్టింది. కాని భర్త క్షమించ వీలుకాని లుచ్చాగాడు. డబ్బుకోసం ప్రతిష్ఠ కోసం మరో మగాడికి తార్చాలని చూశాడు."

"ఈజిట్?"

"పిచ్చి తల్లి... తండ్రిలాంటివాడైన మామయ్యతో తనగోడు చెప్పుకుంది వలవలా ఏడుస్తూ.. అంతా విని ఆ మామయ్య ఏం చేశాడో తెలుసా?"

"ఏం చేశాడు?"

"ఒక వెకిలి నవ్వు నవ్వి 'పరాయివాడి కన్నా ముందుగా నా కోరికను తీర్చు తట్టుకోలేకపోతున్నాను' అన్నాడు"

"దొంగ గాడిద కొడుకు"

"పాపం ఏడుస్తూ పుట్టింటికి పారిపోయి హృదయవిదారకంగా పుట్టింటి వారికి తన గోడు చెప్పుకుంది."

"హమ్మయ్య"

"కాని పుట్టింటివారు మాత్రం ఆమెను బ్రతిమాలారు. కాళ్ళావేళ్ళాపడ్డారు. భర్త తోడిదే లోకం అన్నారు. చివరికి ఆమెను ఎలాగో ఒప్పించి ఇంటి నుండి సాగనంపారు. కాదు... కాదు ఒప్పుకోకున్నా ఇంటి నుండి వెళ్ళగొట్టారు"

"ఛస్"

"వెళుతూ వెళుతూ దారిలో నా దగ్గిరకొచ్చింది. తన కథనంతా వినిపించింది. ఓదార్చునాశించింది. ఆశ్రయమిచ్చాను."

"..." నా గుండెల్లో శూన్యం... కాని శూన్యానికి కూడా ఎంత బరువో... నా గుండెను అప్పడంలా ఒత్తేస్తున్నట్టు .

"ఇంకాస్త ముందుకెళదామా?"

"ఇదేంటి ఇక్కడ అమ్మాయి శవం... అరెరె శరీరం నిండుగా కాలిన గాయాలు.. బాప్రే విరిగిపోయిన కాలు... విరిగిపోయిన చెయ్యి.. అణువణువులోనూ అమాయకత కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న ఈమెని ఇలా చేయడానికి ఎవరికి మనసొప్పింది?" ఆందోళనగా అడిగాను.

"ఆమె భర్తకు, అత్తకు" తాపీగా చెప్పింది కాలువ.

"ఎందుకు?"

"కట్నం కోసం"

"..."

"పెళ్ళి చేసుకున్నప్పుడు సాధ్యమైనంత కట్నం గుంజారు. పెళ్ళయ్యాక తక్కువ కట్నమొచ్చిందే అని తెగ బాధపడిపోయారు. కట్నం తెమ్మని వేధించారు. కాని ఉన్నదంతా అమ్మాయి పెళ్ళికే ఊడ్చి పెట్టి బిచ్చగాళ్ళలా బ్రతుకీడుస్తున్న పుట్టింటివారి నుంచి దమ్మిడీ కూడా రాలలేదు."

"........."

"ఒకరోజు విపరీతంగా కొడుతూ ఉండగా ప్రమాదవశాత్తు ఆమె చేయి విరిగిపోయింది. విరిగిన ఆ చేయిని చూసి తట్టుకోలేక పుట్టింటివారు కొంత డబ్బును పంపారు. దాంతో మొగుడు, అత్తల మెదళ్ళలో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. దాన్ని అమల్లో పెట్టారు. ఇంకో రోజు కాలు విరిచేశారు. ఇంకొన్ని డబ్బులు రాలాయి. ఆసిడ్ పోసి ఒళ్ళంతా కాల్చేశారింకొక రోజు. మరికొన్ని డబ్బులు వచ్చాయి. వారికి తెలుసు 'ఇది బ్రతికుంటేనే తమకు డబ్బులు వస్తాయ'ని... పాపం ఆ అమాయకురాలికి కూడా తెలిసిందా విషయం... తనను చంపరని ప్రతిక్షణం నరకాన్ని చూపిస్తారని.. తన బాధలు కడతేర్చమని కోరుతూ హాయిగా నాలోకి ప్రవేశించింది" ఊపిరి తీసుకోడానికా అన్నట్టుగా ఆగింది కాలువ.

భయంతో ఆవేశంతో ఊపిరందక అవస్థపడ్డాను.

ఇంకాస్త ముందుకు వెళ్ళాం మౌనంగా...

ఒక యువకుని శవం.

"ఈ ఈయనకి ఏం కష్టమొచ్చిందో"? అడిగాను

"పాపం పిచ్చివాడు.. చిన్నప్పుడే చనిపోవటంతో చిన్నప్పటి నుంచి బాధ్యతల సుడిగుండంలో గిరగిరా తిరగసాడు. అయినా ఎన్నడూ అధైర్యపడలేదు. తన తల్లిని పోషించసాగాడు. అతని కోరికల్లా ఒక్కటే తమ కుటుంబం కూడా అందరిలా ఏ లోటు లేకుండా బ్రతకాలని... తన తల్లిని కాలు క్రింద పెట్టనీకుండా ఒక మహారాణిలా చూడాలని అదిగో అదే అతని కొంప ముంచింది"

"అదెలా" ఆశ్చర్యంగా అడిగాను.

"ఎక్కువ జీతం డబ్బులు ఇతారనే ఆశతో గల్ఫ్ దేశాల్లో ఉద్యోగం చేద్దామనుకున్నాడు. కూలిపోతున్న ఇంటిని తాకట్టు పెట్టి, అప్పులు చేసి 35 వేల రూపాయలు ఒక బ్రోకర్ కిచ్చాడు. ఆ రాత్రే అతను ఎన్నో అందమైన కలలు కన్నాడు. తనూ ఒక స్రామాజ్యం నిర్మించుకున్నట్టు ఆ స్రామాజ్యానికి తన తల్లి మహారాణీ అయినట్టు.... కాని కొద్ది రోజుల్లోనే తెలిసింది తాను దారుణంగా మోసపోయినట్టు"

"పాపం" అప్రయత్నంగానే నా నుండి వెలువడిందా మాట.

"అప్పుడే ఏమయింది.. ఇంకా ఉంది"

"ఏమిటది?"

"ఆత్మ విశ్వాసం ఎక్కువ పాళ్ళలో ఉన్న వాడని చెప్పానా.. ఏ మాత్రం అధైర్యపడలేదు. ఎప్పటికయినా భవిష్యత్తును బంగారు మయం చేసుకోకపోతానా అన్న ఆశ అతని పట్టుదలని ఇంకా పెంచింది. కాని చుట్టు పరిసరాలు మాత్రం అతన్ని వెక్కిరించాయి... చేతకాని వాడిగా ముద్రిస్తూ హేళన చేశాయి... చివరకు... చివరకు...." దుఃఖంతో గొంతు పెగల్లేదు... కాలువకు.

కాలువకు కూడా దుఃఖం తెప్పించేంతగా ఏమి జరిగిందా అని ఆశ్చర్యపోయాను.

"చివరకు కన్న తల్లి కూడా అతన్ని పిరికివాడుగా జమకట్టి హేళన చేయడంతో తట్టుకోలేక పోయాడు... పుట్టినప్పటి నుండి గుండెల్లోనే దాచుకున్న కన్నీరు కాల్వలైపారగా నాలోకి ప్రవేశించాడు"

తల తిరిగిపోయింది.. అలా ముందుకెళ్ళాము.

దారిపొడుగునా ఎన్నో శవాలు... వాటిన్నింటి వెనుకా ఏవో దయనీయగాధలు నా గుండెల్ని మెలి పెడుతున్నట్లుగా....

"చూశావుగా దోస్త్! ఇంకా నన్ను ద్వేషిస్తున్నావా?" అడిగింది కాలువ,

"పొరపాటున కూడా.." గొంతు పెగల్లేదు.

"నన్ను అర్థం చేసుకున్నందుకు చాలా థాంక్స్" అంది.

నేను మారు మాట్లాడలేదు.

"నీకు నా వీడ్కోలు" జీరగా అందా కాళువ.

"నేను వెళ్ళను" స్థిరంగా పలికింది నా గొంతు.

"వ్వాట్?" ఈ సారి అదిరిపోవడం కాలువవంతయిది.

"అవును.. నేను వెళ్ళదలుచుకోలేదు" ఇంకా స్థిరంగా పలికాను.

"పిచ్చి గాని పట్టలేదు కదా?" ఆశ్చర్యంగా అడిగింది కాలువ.

"లేదు. గుండెల నిండుగా ఇంత ఘోషను నింపుకుని ఇంక పైకి వెళ్ళలేను. ఇన్ని దారుణాలు చూస్తూ నరకయాతన అనుభవించలేను"

ఈడ్చికొట్టింది కాలువ..

సుడి గుండంలోలా గింగిరాలు తిరిగిపోయాను.

బాధగా చూసాను.

"నిన్నంతగా పిలిచి ఇంత మంది దగాపడ్డ తమ్ముళ్ళ, చెల్లెళ్ళ శవాలను చూపించి, వారి వెనకాల ఉన్న కథలు వినిపించింది ఇందుకేనా?"

రోదించసాగింది కాలువ.

ఆమె రోదనతో నీళ్ళన్నీ వేడెక్కి సెగలు చిమ్మసాగాయి.

"అర్థమైంది... నాకర్థమైంది దోస్త్... నా కర్తవ్యమేంటో నాకు గుర్తొచ్చింది. నే చెయ్యాల్సిన పనులెన్నో ఉన్నాయి... వెళుతున్నాను. థాంక్యూ దోస్త్" అన్నాను.

అనిర్వచనీయ ఆనందంతో పరవళ్ళు తొక్కింది కాలువ.

"సెహబాష్" అంటూ నా వీపు చరిచింది గట్టిగా

ఒడ్డువైపుకు నెట్టింది బలంగా.

✡✡✡